# మా డివిజన్లలో మార్పులు చేయండి

- విభజన తీరుపై పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు
- కలెక్టర్‌కు బీఆర్ఎస్ శ్రేణుల ఫిర్యాదు

కార్పొరేషన్, జూన్ 6: కరీంనగర్ నగరపాలకసంస్థలో చేపట్టిన డివిజన్ల విభజన తీరుపై అన్ని పార్టీల నాయకుల నుంచి పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు వస్తున్నాయి. డివిజన్ల విభజన అశాస్త్రీయంగా చేపట్టారంటూ బీఆర్ఎస్ నగర నాయకులు శుక్రవారం కలెక్టర్ ప్రమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందించారు. అలాగే పలువురు కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్లు, నగర నాయకులు సైతం తమ అభ్యంతరాలపై నగరపాలక అధికారులకు వినతి పత్రాలు అందించారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు

**అశాస్త్రీయంగా డివిజన్ల విభజన : చల్ల హరిశంకర్**

డివిజన్ల పునర్విభజన పూర్తిగా అశాస్త్రీయంగా సాగిందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు మాట్లాడుతూ, డివిజన్ల పునర్విభజన లోపభుయిష్టంగా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. మున్సిపల్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే విభజన చేశారని ఆరోపించారు. భౌగోళిక నైసర్గిక స్వరూపంలో కాకుండా, ఇంటి నంబర్ల వారీగా కాగితాలపై విభజన ప్రక్రియ కొనసాగించారని విమర్శించారు. స్థానిక ప్రజల జీవన విధానాలపై ఎలాంటి అవగాహన లేకుండా.. ప్రజలు, ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా విభజించారని ఆరోపించారు. ఇలాంటి విభజనతో మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనుల్లో ప్రజలకు తరుచూ ఇబ్బందులు వస్తాయన్నారు. అసలైన ఓటర్ల సంఖ్య సుమారు 3,35,592గా లెక్కలు చూపారని, డివిజన్ల వారీగా చూపించిన ఓటర్ లిస్టులో చాలా తేడాలు ఉన్నాయన్నారు. ప్రతి డివిజన్‌లో 5వేల ఓటర్లు ఉండేలా చూపించారని, కానీ కొన్ని డివిజన్లలో 2వేలు, 3వేలు, మరికొన్ని డివిజన్లలో 7వేల నుంచి 8వేల వరకు ఉన్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 100పీట్ల రోడ్డుకు ఇరువైపులా ఒకే డివిజన్ ఉండడం సరికాదని, చాలా డివిజన్లలో రోడ్డుకు ఇరువైపులా ఒకే డివిజన్ ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నాయకులు సైతం ఫిర్యాదు..**

డివిజన్ల విభజన తీరుపై పలువురు కాంగ్రెస్ నాయకులు సైతం అధికారులకు వినతిపత్రాలు అందించారు. తమ డివిజన్‌లో 8-2 ఇంటి నంబర్ సిరీస్‌ను పూర్తిస్థాయిలో ఉంచాలని కాంగ్రెస్ నాయకుడు ఆకుల నర్సయ్య కోరారు. నూతనంగా ప్రకటించిన 32వ డివిజన్‌లో 8-3 సిరీస్‌ను పూర్తి స్థాయిలో ఉండేవిధంగా చూడాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి గడ్డం విలాస్‌రెడ్డి కోరారు. అలాగే 29వ డివిజన్‌లోనూ పలు ఓట్లను ఇంటి నంబర్లను మార్చాలని కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య కోరారు. 64వ డివిజన్‌లో 3-7 సిరీస్ ఉన్న ఇంటి నంబర్లను కలుపాలని మాజీ కార్పొరేటర్ బండారి వేణు వినతిపత్రం అందించారు.

# పాఠశాలల్లో నమోదు శాతం పెంచాలి

- బడిబాటను విజయవంతం చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా, జూన్ 6 : బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహించనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, మండల విద్య అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బందితో బడిబాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమంపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 6 నుంచి 19వరకు బడిబాట నిర్వహించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం.. ప్రతి రోజూ బడిబాటలో చేపట్టాల్సిన అంశాలను పాటించాలన్నారు. బడీడు పిల్లలు, బడి మానేసిన దీర్ఘకాలికంగా బడికి రాని పిల్లలను గుర్తించి స్వయం సహాయక సంఘాల సాయంతో ప్రభుత్వ పాఠశాలలో వారిని నమోదు చేయించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి ఆంజనేయులు, సిడిపిఓలు మండల విద్యాధికారులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుడి కబ్జా నుంచి విడిపించండి

రామడుగు, జూన్ 6: నిరుపేద దళితులకు నాటి ప్రభుత్వం అందించిన భూమిని ఓ కాంగ్రెస్ నాయకుడు కబ్జా చేశాడని.. అతడి బారిన నుంచి విడిపించాలని లక్ష్మీపూర్ గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, 1986 నుంచి 1988 వరకు భూమి కొనుగోలు పథకం ద్వారా సర్వే నంబర్ 146లో నివాస గృహాల కోసం 4.22 ఎకరాల భూమితోపాటు దారి నిర్మాణం కోసం 1.09ఎకరాల పట్టా భూమిని నాటి ప్రభుత్వం కొనుగోలు చేసి నిరుపేద దళితులకు ఇంటి స్థలాల కోసం అందించినట్లు తెలిపారు. నాడు ఇంటి నిర్మాణం చేసుకునే స్థోమత లేకపోవడంతో బేస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేశామన్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కల్లెపెల్లి అంజయ్య సుమారు 20గుంటల భూమిని ఆక్రమించుకున్నాడని వారు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుడి నుంచి సదరు భూమిని విడిపించాలని తహసీల్దార్‌ను కోరారు. కాగా, గతంలో ఇతరులు ఆక్రమించిన స్థలంపై ప్రభుత్వానికి పెట్టిన అర్జీలో సదరు కాంగ్రెస్ నాయకుడు కూడా పంచుసంతకం చేయడం కొసమెరుపు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీపూర్ గ్రామస్తులు

## ఎంసీహెచ్‌లో నవజాత శిశువు మృతి

**వైద్యుల నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆందోళన**

విద్యానగర్, జూన్ 6: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో నవజాత శిశువు మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బాబు మృతి చెందాడని బాధిత కుటుంబసభ్యులు, బంధువులు దవాఖాన ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ రూరల్ మండలం చెర్లభూత్కూర్ గ్రామానికి చెందిన లింగాల వనితకు పురిటినొప్పులు రావడంతో కరీంనగర్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి గురువారం రాత్రి 8గంటలకు తీసుకువచ్చారు. వనితను పరీక్షించిన వైద్యులు ఇంకా నెలలు నిండలేదని చెప్పి, అబ్జర్వేషన్‌లో ఉంచారన్నారు. పురిటినొప్పులు వచ్చినా.. సుమారు రెండు గంటలపాటు పట్టించుకోలేదని చివరకు తాము వైద్యులను నిలదీయగా సర్జరీ చేసి కడుపులోనే బాబు మరణించినట్లు చెప్పారన్నారు. నార్మల్ డెలివరీ కోసం వైద్యులు కాలయాపన చేయడంతోనే తమ బాబు మరణించినట్లు వారు ఆరోపించారు. సర్జరీ చేసే వైద్యులు రాత్రి సమయంలో అందుబాటులో లేకపోవడంతోనే శిశువు మృతి చెందినట్ల వారు ఆవేదన చెందారు. ఈ విషయమై వైద్యులను సంప్రదించగా, వనితను సర్జరీ చేసేందుకు తీసుకెళ్తున్న సమయంలోనే బేబీ కడుపులోనే వీరోచనాలతో చనిపోయిందని, ఇందులో తమ నిర్లక్ష్యంలేదన్నారు. వనిత భర్త మహేశ్ ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పర్యావరణ రక్షణతోనే మానవ మనుగడ

కలెక్టరేట్, జూన్ 6 : సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యంతో పర్యావరణం పూర్తిస్థాయిలో దెబ్బతింటోందని, దీనిని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే మానవ మనుగడ లభిస్తుందని ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక ఉద్యమకారుడు చింతకింది శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని కాపువాడలో పర్యావరణ పరిరక్షణ వేదిక జిల్లాశాఖ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కాలుష్యం పెరిగితే ఢిల్లీ తరహాలో తెలంగాణలో కూడా ఆక్సిజన్ సంచులు కొనుగోలు చేయాల్సిన అవసరమేర్పడుతుందన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే మొక్కలు నాటాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం, ప్రజాప్రయోజనాల పరిరక్షణ సమితి, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల అరెస్ట్

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 4: రాష్ట్ర సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శికా గోయల్ ఆదేశాల మేరకు కరీంనగర్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో, డీఎస్పీ నరసింహారెడ్డి పర్యవేక్షణలో కరీంనగర్ సైబర్ పోలీసుల ప్రత్యేక బృందం మహారాష్ట్రలోని పూణె, ఉస్మానాబాద్ జిల్లాల్లో సైబర్ మోసాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర, పూణెకు చెందిన ప్రసాద్ సురేశ్ గువ్‌హనే, చందన్ విఠల్ గావనే, ఉస్మానాబాద్‌కు చెందిన శ్రేయాస్ ముకుంద్‌ను అరెస్ట్ చేశారు. నిందితులు బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్, రేటింగ్, రివ్యూ ప్రకటనలు, పార్ట్ టైం ఉద్యోగాల వంటి పేర్లతో ప్రలజను మోసం చేశారని, బాధితుల నమ్మకాన్ని దెబ్బతీసీ, వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయించుకున్నారు. ఈ మోసాల ద్వారా కేవలం కరీంనగర్ జిల్లాలో నమోదైన రెండు కేసుల్లోనే దాదాపు రూ. 92 లక్షలు బాధితులు కోల్పోయారు. నిందితులపై తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. తదుపరి విచారణ, రిమాండ్ ఉత్తర్వుల కోసం న్యాయస్థానానికి నిందితులను హాజరుపరిచారు. సీఐ సునీల్, ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది కేశవ్, అరుణ్, వసీమ్ అక్రమ్‌ను అధికారులు అభినందించారు.

## 'సుద్దాల స్ఫూర్తి ప్రదాత'

కమాన్‌చౌరస్తా, జూన్ 6 : ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు నేటి సాహిత్యకారులకు అనవతరం స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని పలువురు రచయితలు కవులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రచయితల వేదిక (తెరవే) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సాహితీ వెన్నెల నిలయంలో, వెంకటేశ్వర నగర్ బుర్ర తిరుపతి నివాసంలో సుద్దాల హనుమంతు జయంతి సభ నిర్వహించారు. ప్రజల నాలుకల మీదున్న జానపద బానిలతో చైతన్య గీతాలు రాసి ప్రజా కళాకారులకు ఆదర్శ మార్గాన్ని వేసిన వారని సుద్దాల సాహిత్య శైలిని వక్తలు కొనియాడారు. కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్యలు కార్యక్రమానికి సమన్వయకర్తలుగా వ్యవహరించగా, కవులు అన్నవరం దేవేందర్, గాజోజ నాగభూషణం, బివియన్ స్వామి, తిరుపతి, బూర్ల వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

## శుక్రవారం సభ భేష్.. కలెక్టర్‌ను అభినందించిన మంత్రి సీతక్క

కలెక్టరేట్, జూన్ 6: మహిళల సమస్యలు పరిష్కరించే క్రమంలో ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న సభ బాగుందని మంత్రి సీతక్క కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసే అంశాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీ ల్లో నిర్వహించిన మేథోమధన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా శిశుసంక్షేమ శాఖ ప్రగతి నివేదికను డీడబ్ల్యూవో ఎం సరస్వతి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మహిళల ఆరోగ్యం, పోషకాహార స్థితిని మెరుగుపర్చేందుకు, పలు సామాజిక సమస్యయల పరిష్కారానికి ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహిస్తున్న సభ ఎలా ఉపకరిస్తుందో తెలియజేశారు. సదస్సుకు హాజరైన మంత్రి సీతక్క, శిశుసంక్షేమశాఖ కార్యదర్శి అనితా రాంచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ తిలకించి, అబ్బురపడ్డారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేస్తే సత్ఫలితాలు వస్తాయని, ఈ సభ విధివిధానాలు పరిశీలించాలని సంబంధికారులను మంత్రి ఆదేశించినట్లు డీడబ్ల్యూవో వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలాసత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలెక్టర్ చాంబర్‌లో డీడబ్ల్యూవో, సీడీపీవోలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.

## కులగణన చేపట్టి బీజేపీ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి

చిగురుమామిడి, జూన్ 5: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జనగణనలో కులగణన చేపట్టే ప్రక్రియను మార్చి 2027 సంవత్సరానికి వాయిదా వేయడం బీసీ సమాజాన్ని మోసం చేయడమేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ పోరాటాలకు స్పందించి కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బీజేపీ ఆలస్యంగానైనా కులగణన చేపడతామని ప్రకటించడం హర్షనీయమని, ఆహ్వానించదగ్గ విషయమన్నారు. కాని, కులగణన చేపట్టే కార్యక్రమాన్ని మార్చి 2027 వాయిదా వేయడంపై పలు అనుమానాలకు, సందేహాలకు తావిస్తుందన్నారు. ఈ అనుమానలాన్నింటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదన్నారు. బీసీలను ఓట్ల కోసం, సీట్ల కోసం వాడుకోవాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. వచ్చే నెలలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో తగిన కార్యాచరణతో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గట్టు ప్రశాంత్, నాయకులు గంగుల లింగం కుమార్, దరి రాజేశం, కక్కెర్ల సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషను సుసంపన్నం చేసింది పద్యమే

**ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి**

కమాన్‌చౌరస్తా, జూన్ 6 : తెలుగు భాషకే వన్నెతెచ్చిన పద్యం ద్వారా తెలుగు భాషలో పట్టు, భాషా సౌందర్యం, జీవన విలువల బోధన, భాషపై మక్కువ లాంటివి అనుభవంలోకి వస్తాయని తెలంగాణ తెలుగుభాష సంరక్షణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాస్యం సేనాధిపతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం వాగేశ్వరి డిగ్రీ పీజీ కళాశాల సమావేశ మందిరంలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం కరీంనగరం శాఖ నిర్వహించిన తెలుగు పద్య పఠన పోటీల బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తెలుగు పద్యాలను నేటి పిల్లలకు పరిచయం చేయాలని, మాతృభాష మాధుర్యాన్ని ఆస్వాదించాలన్నారు. న్యాయ నిర్ణేతలు అన్నాడి గదేందర్ రెడ్డి, పండితులు రామ్మోహన్ శర్మ మాట్లాడుతూ, పోటీల నియమనిబంధనలు తెలియజేశారు. తెలుగు భాష సంరక్షణ సంఘం కార్యదర్శి, కోశాధికారి అనుముల దయాకర్ సమన్వయకర్తగా సేవలు అందించి పోటీల నిర్వహణను సజావుగా నడిపించారు. పోటీదారులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

## రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించాలి

**అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్**

మానకొండూర్ రూరల్, జూన్ 6: భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లిలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆర్డీవో మహేశ్వర్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. గ్రామంలో మొత్తం 137 దరఖాస్తులు వచ్చినట్లు నాయబ్ తహసీల్దార్ సమ్మయ్య తెలిపారు.

## సుడా చైర్మన్‌కు సన్మానం

రామడుగు, జూన్ 6 : మండలంలోని వెలిచాల శివారులోని కాకతీయ కాల్వ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వీధి దీపాల ఏర్పాటుకు రూ. 20 లక్షల నిధులను మంజూరు చేయడంపై శుక్రవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని వెలిచాల మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావుతో కలిసి స్థానిక బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దీనిలో భాగంగా నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. వెలిచాల అభివృద్ధికి తోడ్పాటును అందించడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుబంధు జిల్లా మాజీ సభ్యుడు సంజీవరావు, మాజీ వార్డు సభ్యుడు వెంకటరమణ, టీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

## చోరీకి విఫలయత్నం

గంగాధర, జూన్ 6 : మండలంలోని మధురానగర్ చౌరస్తాలో గురువారం రాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఎస్ఐ వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ చౌరస్తాలోని బోయినిపల్లికి వెళ్లే దారిలో మణికంట వైన్ పరిమిట్ రూమ్‌లో గురువారం అర్ధరాత్రి ఇనుప రాడ్‌తో తలుపు పగులగొట్టి చోరీకి యత్నించారు. శుక్రవారం ఉదయం దుకాణం వద్దకు వచ్చిన యజమాని లింగంపెల్లి లక్ష్మణ్‌కు షాపు తాళం పగులగొట్టి ఉండడం, షాపులో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు. షాపు నుంచి దొంగలు ఏమి ఎత్తుకెళ్లలేదని ఎస్ఐ తెలిపారు. షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## లాంగ్వేజెస్ కొనసాగించాలి

కమాన్‌చౌరస్తా, జూన్ 6: తెలంగాణ డిగ్రీ కళాశాలల భాషా అధ్యాపకుల ఫోరం ఆధ్వర్యంలో డిగ్రీ మూడో సంవత్సరంలో కూడా లాంగ్వేజెస్ కొనసాగించాలని స్థానిక శాతవాహన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం కన్వీనర్, ఎస్ఆర్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, ఆంగ్ల విభాగ అధ్యక్షుడు డాక్టర్ నీలం శ్రీనివాసులు, బూర్ల వెంకటేశ్వర్లు, అరుంధతి ఉన్నారు.

## పశువులకు ఆరోగ్య పరీక్షలు

కరీంనగర్ రూరల్, జూన్ 6: బక్రీద్ సందర్భంగా బొమ్మకల్ ప్రాంతంలోని రజ్వీచమాన్, విజయనగర్ కాలనీలో ఉన్న పశువధశాలల్లోని సుమారు వంద పశువులకు శుక్రవారం పశువైద్యులు ఆర్యోగ పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం పశువుల ఆరోగ్యం, ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా యాజమానులకు వెరిఫికేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ముస్లిం మత పెద్దలతో పశు వధలకు సంబంధించిన నిబంధనల గురించి వివరించారు. వెటర్నరీ డాక్టర్లు, పోలీసు సిబ్బంది ఉన్నారు. సుఖసంతోషాలతో బక్రీద్ జరుపుకోవాలని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి అకాంక్షించారు.

## యశోదలో విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం

విద్యానగర్, జూన్ 6 : సోమాజిగూడ యశోద దవాఖాన వారి కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ఉచిత కిడ్నీ వైద్య శిబిరం నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అరుణ్‌కుమార్ పొన్నతో విజయవంతమైందని యశోద మెడికల్ సెంటర్ ఇన్‌చార్జి సురభి రాజేందర్ రావు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సు మారుగా 100 మంది పేషంట్లు కిడ్నీలో రాళ్లు, కిడ్నీ ఇన్ఫెక్షన్, కిడ్నీ సమస్యలు, డయాలసిస్ అవసరం ఉన్నవారికి ఉచిత వైద్యం, సలహాలు అందించారు. ఈ శిబిరంలో సోమాజిగూడ యశోద దవాఖాన నెఫ్రాలజిస్ట్ అరుణ్‌కుమార్ పొన్న, కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.





యశోద దవాఖాన నెఫ్రాలజిస్ట్ అరుణ్‌కుమార్ పొన్న

## బీజేపీ కనుసన్నల్లోనే డివిజన్ల పునర్విభజన

కలెక్టరేట్, జూన్ 6 : నగరంలో చేపట్టిన డివిజన్ల పునర్విభజన బీజేపీ కనుసన్నల్లో జరిగినట్లు కనిపిస్తోందని, ఎంఐఎం నగరశాఖ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆరోపించారు. డివిజన్ల డిలిమిటేషన్ పేర దళితులు, ముస్లీం ఓట్లు పక్క డివిజన్లలో కలిపారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలవడం కోసమే పక్కా ప్రణాళికతో డివిజన్ల విభజన చేశారని మండిపడ్డారు. దళితులు, ముస్లీంలు కార్పోరేటర్లుగా గెలవకూడదనే దురాలోచనతోనే ఈకుట్రకు తెరలేపారని దుయ్యబట్టారు. ఎంఐఎం ప్రాతినిత్యం వహించిన డివిజన్లలో ఉన్న దళితులు, ముస్లీంలను ఓట్లను ముక్కలు చేయటం వెనుక ఎవరి హస్తం ఉన్నదో అధికారులే చెప్పాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలోనే డివిజన్ల పునర్విభజన కొనసాగించాలని, లేనిపక్షంలో ఎంఐఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

జైదాపూర్, జూన్ 6 : మండలంలోని పెర్కపల్లిలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన చేయగా, ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, మాజీ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు గాంధీయాదవ్, సర్దార్, గ్రామ అధ్యక్షుడు కొమురయ్య పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు సత్తా

కొత్తపల్లి, జూన్ 6: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 47వ తెలంగాణ స్టేట్ లెవల్ జూనియర్ బాయ్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో జిల్లా బాలుర జట్టు క్రీడాకారులు బంగారు పతకం సాధించారు. ఈనెల 4 నుంచి 6వరకు నల్గొండ జిల్లా నకిరేకల్‌లో జరిగిన జూనియర్స్ బాయ్స్ గర్ల్స్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు వరంగల్ జట్టుపై ఫైనల్‌లో 20-13స్కోర్‌తో గెలుపొంది బంగారు పతకం సాధించారు. బాలుర జట్టు కోచ్‌గా మూల వెంకటేశ్, మేనేజర్‌గా శ్రీకాంత్ వ్యవహరించారు. పతకం సాధించిన క్రీడాకారులకు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బాసరవేణి లక్ష్మణ్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ క్రీడా సంఘాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

## వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

మానకొండూర్ రూరల్, జూన్ 6 : మండలం కొండపల్కల గ్రామంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతన్నలను సంపన్నులను చేయాలనే ఉద్దేశ్యంతో తీసుకొచ్చిన ఈ కార్యక్రమంలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం (జమ్మికుంట), వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. శోధన సంస్థ శాస్త్రవేత్తలు బ్రజేంద్ఫ, డాక్టర్ ఉమేశ్, ప్రధాన శాస్త్రవేత్త ఎన్ వెంకటేశ్వర్ రావు, వేణు గోపాల్, ఏడీఏ శ్రీధర్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

## చర్యలు తీసుకుంటాం

కరీంనగర్ రూరల్, జూన్ 6: ఎస్సారెస్పీ 12ఆర్ కాలువను అక్రమించి, నిర్మాణాలను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాజేశ్ హెచ్చరించారు. శుక్రవారం చేగుర్తిలో గాండ్ల లక్ష్మీనారాయణ కాలువను అక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో గ్రామంలోని చెరువులోకి నీరు రావడం లేదని కొందరు ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకుంటామన్నారు. భూభారతిలో మొత్తం 123దరఖాస్తులు వచ్చాయని నయాబ్ తాహసీల్దార్ తెలిపారు.

## వాగేశ్వరిలో ఫ్రెషర్స్ హంగామా

తిమ్మాపూర్, జూన్ 6: మండలంలోని రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'ఎస్ట్రేల్ల' పేరుతో నిర్వహించిన స్వాగతోత్సవ వేడుకలు అలరించాయి. విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో వస్తున్న విప్లవత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ప్రకాశ్ రెడ్డి, వినోద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హెచ్‌వోడీ వెంకట్ రెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఎండీ ఎస్సైగా శ్రీకాంత్ గౌడ్

తిమ్మాపూర్, జూన్ 6: ఎల్ఎండీ ఎస్సైగా శ్రీకాంత్ గౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వివేక్ కరీంనగర్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యమిస్తానని అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతానని స్పష్టం చేశారు. అలాగే తనకు ఇన్నాళ్లు సహకరించిన అందరికీ ఎస్ఐ వివేక్ కృతజ్ఞతలు తెలిపారు. సిబ్బంది ఎస్సై వివేక్ ను శాలువాతో సత్కరించి వీడ్కోలు తెలిపారు.

## శాతవాహనలో భూమి పూజ

కమాన్‌చౌరస్తా, జూన్ 6 : శాతవాహన విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనం నుంచి గెస్ట్ హౌస్ వరకు మెట్ల నిర్మాణం కోసం నూతన రహదారి నిర్మాణం కోసం వీసీ ఆచార్య యు ఉమేష్ కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగంగా దాదాపు పది లక్షల వ్యయంతో రహదారి నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భూమి పూజను ఎగ్జిక్యూటివ్ కౌన్సెల్ ఆమోదంతో నిర్మాణం చేపడుతున్నట్టుగా వివరించారు.

## బెస్ట్ అవేలేబుల్ స్కూళ్లలో అదనపు సీట్ల కేటాయింపు

కలెక్టరేట్, జూన్ 5 : 2025-26 విద్యాసంవత్సరానికి జిల్లాలోని గిరిజన విద్యార్థుల కోసం బెస్ట్ అవేలేబుల్ స్కూళ్లలో అదనంగా 5 సీట్లు కేటాయించినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. 3వ తరగతిలో లంబాడా బాలురకు ఒకటి, ఎరుకల బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి, 5వతరగతిలో ఎరుకల బాలురకు ఒకటి, 6వ తరగతిలో లంబాడా బాలికలకు ఒకటి చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. ఔత్సాహిక విద్యార్థులు ఈనెల 9 నుంచి 17 సాయంత్రం 5 గంటల్లోపు అవసరమైన ధృవీకరణపత్రాల ప్రతులు జతచేసి, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 20న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు, గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 9652118867ను సంప్రదించాలన్నారు.

## పెద్ద చెరువుకు మరమ్మతులు చేయాలి

వీణవంక, జూన్ 6 : వీణవంక పెద్ద చెరువుకు మరమ్మతులు చేపట్టి మత్స్యకారులను ఆదుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ రజితకు వీణవంక మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నాయకులు పెద్ద చెరువుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గ్రామ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కేసులపై విచారణ జరిపించాలి

తెలంగాణ చౌక్, జూన్ 6 : ఎస్సీ, ఎస్టీ కేసులపై సీబీఐ విచారణ జరిపించాలని భీమ్ ఆర్మీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బోయినపల్లి చంద్రయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని శుక్రవారం డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసులను ప్రజాప్రతినిధుల జోక్యం చేసుకొని సాక్షధారాలు ఉన్న బెదిరింపుల పాల్పడుతూ కేసులను నీరగారుస్తున్నారన్నారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు.

## రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన

వీణవంక, జూన్ 6 : వీణవంక రైతువేదికలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు డా. కృష్ణవేణి మాట్లాడుతూ, రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, జూన్ 6: మండలంలోని వంకాయ గూడెం వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. చింతగుట్టకు చెందిన ఎం వెంకటయ్య వ్యక్తిగత పనిపై కేశపట్నం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఓ లారీ ఢీకొంది. దీంతో వెంకటయ్యకు గాయాలు కాగా, ఆయనను దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

# సమాజంలో ప్రభుత్వ పాఠశాలలు టీకా లాంటివి : డీఈవో

మానకొండూర్ రూరల్, జూన్ 6 : ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ పాఠశాలలు ఒక టీకా లాగా సమాజానికి రాబోయే రుగ్మతలను గుర్తించి, సమాజాన్ని చక్కటి మార్గంలో నడపడానికి ప్రభుత్వ పాఠశాలలు ఉపయోగపడతాయని, వాటిని బలోపేతం చేసుకోవాల్సిన వసరం ఉందని డీఈవో శ్రీరామ్ మొండయ్య తెలిపారు. శుక్రవారం మండలం అన్నారం గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుదర్శన్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో, ఎంఈవో మధుసూధనాచారితో కలిసి పాల్గొన్నారు. గ్రామసభను నిర్వహించగా, గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు.

**సర్కారు బడులను బలోపేతం చేయాలి**

హుజూరాబాద్ /గంగాధర/కొత్తపల్లి/కరీంనగర్ రూరల్: జూన్ 6: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంపీడీవో సంజీవరావు పిలుపునిచ్చారు. నగునూర్ పంచాయతీ కార్యాలయం ఎదుట జరిగిన బడిబాటలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని కోరారు. కొత్తపల్లి మండలంలోని ఎలగందుల ఉన్నత పాఠశాలలో గ్రామ సభను నిర్వహించారు. హెచ్ ఎం తుమ్మ ఆనందం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు. గంగాధర మండలంలోని ఒ ద్యారం ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట నిర్వహించారు. పిల్లలను సర్కారు బడిలో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటాలు వేయాలని మండల విద్యాధికారి ప్రభాకర్‌రావు అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం బీ తిరుమల, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో బాలికల ఉన్న త పాఠశాల ఆవరణలో బడిబాట నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మా జీ కౌన్సిలర్లు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
CHANGE OF NAME
★I, NADIMETLA LATHA, D/o. Nadimetla Swamy has Married Nagula Naresh, Residing at H.No. 2/40/8/A/1, Block B, Plot No. 8, Theegalaguttapally, Karimnagar-505 001. I have Changed My Name from NADIMETLA LATHA, D/o. Nadimetla Swamy to NAGULA PADMA, W/o. Nagula Naresh.
NT-343048

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189